15.07 లక్షల మంది ఆరోగ్య వివరాల సర్వే

466 శిబిరాల నిర్వహణ - 1,79,536 ఓపి నమోదు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జిల్లాలో విజయవంతంగా కొనసాగుతుంది. ఇప్పటి వరకూ జిల్లాలో ఆశా వర్కర్లు, ఎఎన్‌ఎంలు ఇతర ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి 15,07,680 మంది ఆరోగ్య వివరాలను సర్వే చేశారు. జిల్లాలో ఇప్పటి వరకూ గ్రామీణ ప్రాంతాల్లో 440, పట్టణ ప్రాంతాల్లో 26 కలిపి మొత్తం 466 వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాల్లో 1,79,536 మందిని పరీక్షించగా అందులో 2,886 మందిని వివిధ ఆస్పత్రులకు మెరుగైన వైద్యం కోసం రిఫర్ చేశారు. ఈ శిబిరాల్లో 127 రకాల మందులను అందుబాటులో ఉంచుతున్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి నెలరోజులకు సరిపడ మందులు ఇస్తున్నారు.

అంగన్‌వాడీలపై ఆర్థికభారం..!

జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల్లో సొంత డబ్బులతో స్టాల్స్ ఏర్పాటు
ప్రదర్శనకు 50 రకాల వంటలు తయారీ
ఒక్కో క్యాంపునకు రూ.4 వేల నుంచి రూ. ఏడు వేల వరకు ఖర్చు
ఇప్పటికే అనేక సమస్యలతో అంగన్‌వాడీలు సతమతం

భీమవరం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో అంగన్‌వాడీలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్

ప్రజాశక్తి - భీమవరం (పశ్చిమగోదావరి)

సవాలక్ష సమస్యలతో సతమతమవుతున్న అంగన్వాడీలపై ఆర్థిక భారం పడింది. జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల్లో అంగన్వాడీలు సొంత డబ్బులు వెచ్చించి రకరకాల పౌష్టికాహార వంటలు తయారుచేసి స్టాల్స్ ఏర్పాటు చేయడంతో మరిన్ని ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కో క్యాంపునకు రూ.4వేల నుంచి రూ.ఏడు వేల వరకు సొంత డబ్బులు వెచ్చిస్తున్నారు. స్టాల్స్ ఏర్పాటు తప్పనిసరిగా చేయాలని అధికారుల నుంచి ఒత్తిడి రావడంతో ఆర్థిక భారమైనప్పటికీ తప్పని పరిస్థితుల్లో అంగన్వాడీలు స్టాల్స్ ఏర్పాటు చేస్తూ నెల రోజుల నుంచి అష్టకష్టాలు పడుతున్నారు. ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించాలనే ముఖ్య ఉద్దేశంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని గతనెల 30 నుంచి ప్రారంభించింది. ఈ క్యాంపుల్లో ప్రత్యేక వైద్యులతో ఆరోగ్య సేవలందించడంతోపాటు ఉచితంగా మందులు కూడా పంపిణీకి కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నారు. అయితే ఈ క్యాంపుల్లో ప్రత్యేక స్టాల్స్ కూడా ఏర్పాటు చేస్తున్నారు. దీనిలో భాగంగా వైద్య సేవలకు సంబంధించిన స్టాల్స్‌తో పాటు అంగన్వాడీలు అందించే పౌష్టికాహారానికి సంబంధించిన స్టాల్స్‌ని కూడా ఏర్పాటు చేస్తున్నారు. అయితే ఈ స్టాల్‌లో రకరకాల పౌష్టికాహార వంటలను అంగన్వాడీలు వండి ప్రదర్శనకు ఉంచుతున్నారు. అయితే ఈ వంటకాలకు సంబంధించిన ఆర్థిక భారాన్నంత అంగన్వాడీలు మోస్తున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో ఏడు ఐసిడిఎస్ ప్రాజెక్టులు, ఏలూరు జిల్లాలో 13 ప్రాజెక్టులున్నాయి. ఈ రెండు జిల్లాల్లో 3600 మెయిన్, మినీ అంగన్వాడీ కేంద్రాలున్నాయి. ఉమ్మడి జిల్లాలో దాదాపుగా 7200 మంది అంగన్వాడీలు పనిచేస్తున్నారు. అయితే ఈ శిబిరాల వద్ద స్టాల్స్ ఏర్పాటు చేసి పౌష్టికాహారంతో కూడిన పదార్థాలను ప్రదర్శించాలని ఉన్నతాధికారులు ఒత్తిడికి గురిచేయడంతో తప్పనిసరి పరిస్థితుల్లో స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఇదిలా ఉంటే సురక్ష శిబిరానికి వచ్చిన వారందరికీ అంగన్‌వాడీలు తయారు చేసిన వంటల రుచి చూపించడంతోపాటు వాటిలోని పౌష్టికాహారం గురించి వివరించే బాధ్యత కూడా అంగన్వాడీలే నిర్వర్తిస్తున్నారు. అయితే రకరకాల వంటల తయారీకి ఎలాంటి బడ్జెట్‌ను కేటాయించలేదు. దీంతో అంగన్వాడీ కార్యకర్తలు సొంత డబ్బులతో సామాలు, కొర్రలు, కూరగాయలు, మాంసకృత్తులు ఇతర వస్తువులను కొనుగోలు చేసి వాటితో పదార్థాలను తయారు చేసి స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో తమపై ఆర్థిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ సురక్ష కార్యక్రమం చేపట్టి నెల రోజులుగా అంగన్వాడీలు అధికారుల ఒత్తిడి తాళలేక ఆర్థికభారాన్ని మోయలేక మానసికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సచివాలయానికి ఒక క్యాంపు చొప్పున ఏర్పాటు చేయడంతో ఆ ప్రాంతంలో ఉన్న అంగన్వాడీ కార్యకర్తలు అంతా తలో కొంత వేసుకుని వంటకాలు తయారు చేస్తున్నారు. కొన్నిప్రాంతాల్లో మినీ అంగన్వాడీ కార్యకర్తలు అప్పు చేసి పెడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమస్యలతో సతమతం

ఇప్పటికే అంగన్వాడీలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయపోవడంతో పాటుగా ప్రభుత్వం ఇచ్చే దానిలో సైతం కోతలు విధించడంతో ఆర్థికంగా మానసికంగా ఇబ్బందులు పడుతున్నారు. విపరీతమైన పని భారం, ఆన్‌లైన్ పని, కేంద్రాల నిర్వహణ, అధికారుల రాజకీయ ఒత్తిడితో అవస్థలు పడుతున్నారు. సుమారు 18 నెలల నుంచి కనీసం టిఎ, డిఎ కూడా ప్రభుత్వం చెల్లించలేదు. చివరకు అంగన్వాడీ కేంద్రాల అద్దెలు సైతం నాలుగు నెలల నుంచి చెల్లించలేదు. నెల మొత్తం అంగన్వాడీలు కష్టపడి పని చేస్తున్నప్పటికీ కనీస వేతనాలు కూడా సక్రమంగా ప్రభుత్వం అందించలేదు. రెండు నెలల నుంచి వేతనాలు పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇలా అనేక సమస్యల మధ్య అంగన్వాడీలు నలిగిపోతూ విధులు నిర్వహిస్తున్నప్పటికీ ప్రభుత్వం పని భారం మోపడంతో పాటు మరింత ఆర్థిక భారాన్ని కూడా మోపడంతో అంగన్వాడీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం సురక్ష శిబిరాల వద్ద స్టాళ్ల నిర్వహణతో మరింత అవస్థలు పడుతున్నట్లు వాపోతున్నారు. ఈ విషయాన్ని బయటకు చెప్పుకోలేక, అధికారులను బిల్లులు అడగలేక నరకయాతన అనుభవిస్తున్నారు. ఉన్నతాధికారులు ఒత్తిడి చేయడంతో తప్పనిసరి పరిస్థితుల్లో తమ డబ్బులతో సరుకులను కొనుగోలు చేసి పౌష్టికాహారం తయారు చేస్తున్నట్లు చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి అంగన్వాడీల ఇబ్బందులపై దృష్టిసారించి పౌష్టికాహారం తయారీకి బడ్జెట్ కేటాయించాలని కోరుతున్నారు.

నిధులు కేటాయిస్తాం

సుజాత రాణి, ఐసిడిఎస్ పీడీ, పశ్చిమగోదావరి జిల్లా

జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల్లో అంగన్వాడీలు ఏర్పాటు చేస్తున్న స్టాల్స్‌లో పెడుతున్న వంటకాలకు సంబంధించి నిధులు కేటాయించడం జరుగుతుంది. ప్రాజెక్ట్, అంగన్వాడీ కేంద్రాల వారీగా వీటిని కేటాయిస్తాం. ఎక్కువగా వంటకాలు బాలామృతంతో చేసినవే ప్రదర్శించడం జరిగింది. అలాగే ఆకుకూరలు, పండ్ల వంటివి స్టాల్స్‌లో ఉంచుతాము వీటికి ఎంత మేర ఖర్చువుతుందో చూసి ఆ విధంగా నిధులు కేటాయించడం జరుగుతుంది.

ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి

కె.జాన్సీ, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ (సిఐటియు)

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పౌష్టికాహార పదార్థాల తయారీకి అవసరమైన ఖర్చులను ప్రభుత్వం భరించాలి. వీటికి ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాలి. ఇప్పటికే అంగన్వాడీలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. మూడు నెలల నుంచి జీతాలు అందడం లేదు. బిల్లులు కూడా మంజూరు చేయట్లేదు. ఈ పరిస్థితుల్లో వేలాది రూపాయలు పౌష్టికాహారానికి అంగన్వాడీలు ఖర్చు చేస్తున్నారు. సుమారు 50 రకాల వంటకాలను తయారు చేస్తున్నారు. ఇది సరైంది కాదు. ఆర్థిక భారం తాళలేక అప్పులు చేయాల్సి వస్తుంది. ప్రభుత్వం దృష్టిసారించి బడ్జెట్ కేటాయించాలి.

వృద్ధుల సంక్షేమం, హక్కుల రక్షణకు కృషి

వికలాంగులు, హిజ్రాల, వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు ప్రభాకర్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

నిరాదరణకు గురవుతున్న వృద్ధుల సంక్షేమంతో పాటు వారి హక్కుల పరిరక్షణకు తమ శాఖ నిరంతరం కృషి చేస్తుందని వికలాంగుల, హిజ్రాల, వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జిసిహెచ్.ప్రభాకర్ తెలిపారు. వికలాంగులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలేంటి, రాయితీలేంటి? హిజ్రాల సంక్షేమానికి ఎలాంటి చర్యలు చేపడుతున్నారు? వృద్ధుల రక్షణ చట్టాల అమలు తీరు ఎలా ఉంది వంటి పలు ప్రశ్నలకు ప్రజాశక్తి ముఖాముఖిలో ఆయన సమాధానాలిచ్చారు.

ప్రశ్న : వికలాంగుల, హిజ్రాల, వృద్ధుల సంక్షేమ శాఖ ముఖ్య ఉద్దేశం ఏమిటి?

వికలాంగులకు, హిజ్రాలకు, వృద్ధులకు ప్రభుత్వం కల్పించే రాయితీలు అందించడంతోపాటు వారి హక్కుల పరిరక్షణకు కృషి చేయటం, వారికి కావాల్సిన ఉపకరణాలు అందించడమే ఈ శాఖ ముఖ్య ఉద్దేశం.

ప్రశ్న : వృద్ధుల సంక్షేమం కోసం ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

వృద్ధులకు గుర్తింపు కార్డులు అందజేయడం, అవసరమైన వారికి చేతి కర్రలు, వీల్ చైర్లు అందిస్తున్నాము. అలాగే 2007 వృద్ధుల, తల్లిదండ్రుల సంక్షేమ జీవన భృతి చట్టంపై అవగాహన కల్పించి ఆ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసి నిరాదరణకు గురైన వృద్ధులను ఆదుకోవడం జరుగుతుంది.

ప్రశ్న : 2007 చట్టం ప్రకారం వృద్ధులకు ఎలాంటి రక్షణ కల్పించబడుతుంది? ఈ సంవత్సరం జిల్లాలో ఎంతమందికి రక్షణ కల్పించారు?

ఈ చట్టం ప్రకారం 60 సంవత్సరాలు దాటి, పిల్లలు ఉండి ఆ పిల్లల ద్వారా నిరాదరణకు, నిర్లక్ష్యానికి గురైతే ప్రతి రెవెన్యూ డివిజన్ పరిధిలో ఆర్‌డిఒ ఆధ్వర్యంలో మెయింటినెన్స్ ట్రిబ్యునల్ ద్వారా ప్రతినెల ఆ వృద్ధులకు రూ.పదివేల వరకూ మెయింటినెన్స్ పిల్లల నుంచి ఇచ్చేలా ఆదేశాలు ఇవ్వడం జరుగుతుంది. ఈ సంవత్సరం ఆర్‌డిఒ పరిధిలో 27 మందికి, నూజివీడు సబ్ కలెక్టర్ పరిధిలో 22 మందికి, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ పరిధిలో 17 మందికి జీవన భృతి కల్పించాము. ఈ విషయంలో తల్లిదండ్రులు సంతృప్తి చెందకపోతే జిల్లా కలెక్టర్ వద్ద అప్పీల్ చేయొచ్చు. అంతేకాక సెక్షన్ 23 ప్రకారం ఎవరైనా తల్లిదండ్రులు పిల్లలకు ఆస్తి రాసి ఇచ్చిన తరువాత నిరాదరణకు గురైతే తిరిగి ఆస్తిని స్వాధీనం చేసుకోవచ్చు. పై చర్యలు అమలు చేయకపోతే తల్లిదండ్రులను, వృద్ధులను నిర్లక్ష్యం చేసిన పిల్లలకు ఆరు నెలల వరకూ జైలు శిక్ష అమలు చేసే అవకాశం ఉంది.

ప్రశ్న : వికలాంగుల హక్కుల చట్టం ప్రకారం వారికి ఎలాంటి హక్కులు రాయితీలు కల్పించబడతాయి?

2016 వికలాంగుల హక్కుల చట్టం ప్రకారం వారికి సామాజిక గౌరవం లభించేలా చేయడం, ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో వికలాంగులకు సౌకర్యాలు కల్పించడం, (ఉదాహరణకు వారు కార్యాలయంలోకి వెళ్లేందుకు ర్యాంపు నిర్మించడం వంటివి), మున్సిపల్, పంచాయతీల్లో బిల్డింగ్ ప్లాన్ ఇచ్చే సమయంలో వికలాంగుల హక్కుల చట్టం ప్రకారం నిర్మాణం ఉంటేనే ప్లాన్ అప్రూవల్ చేసేలా చర్యలు తీసుకోవడం, ఉద్యోగాల్లో రిజర్వేషన్ పరిశీలించి వారికి కేటాయించిన నాలుగు శాతం రిజర్వేషన్ ప్రతీ కార్యాలయంలో అమలు జరిగేలా చూడటం వంటి హక్కులు వారికి కల్పించబడతాయి.

ప్రశ్న : వికలాంగ విద్యార్థులకు ఎలాంటి రాయితీలు, సౌకర్యాలను ప్రభుత్వం అందిస్తుంది?

వికలాంగ విద్యార్థులకు ఏలూరు జిల్లా కేంద్రంలోని కోటదిబ్బపై రెండు హాస్టళ్లు నిర్మిస్తున్నారు. నాలుగో తరగతి నుంచి పోస్ట్ గ్రాడ్యుయేషన్ వరకూ అన్ని సౌకర్యాలూ ఉచితంగా కల్పించబడతాయి. అలాగే ఉన్నత విద్య చదివే వారికి 50 వేల రూపాయలు విలువచేసే ల్యాప్‌టాప్‌లు ఉచితంగా ఇస్తారు. ఈ సంవత్సరం పదిమందికి ఇవ్వడం జరిగింది.

ప్రశ్న : వికలాంగులకు ఎలాంటి ఉపకరణాలు మీ శాఖ ద్వారా అందిస్తున్నారు? జిల్లాలో ఈ సంవత్సరం ఎంతమందికి ఇచ్చారు?

ఈ సంవత్సరం జిల్లాలో 22 మందికి వీల్ చైర్లు, 18 మందికి ట్రై సైకిళ్లు ఇచ్చాము. అలాగే ఏలూరు జిల్లాలో 70 మందికి, పశ్చిమగోదావరి జిల్లాలో 70 మందికి మొత్తం 140 మందికి మోటార్ సైకిళ్లు అందించాము. అలాగే బధిరుల కోసం ప్రత్యేక ఫోన్లు పది మందికి ఇచ్చాము. అలాగే వినికిడి యంత్రాలు, మానసిక వికలాంగుల కోసం డైజీ ప్లేయర్స్ కిట్‌లు ఇచ్చాము.

ప్రశ్న : వికలాంగుల స్వయం ఉపాధికి మీ శాఖ ద్వారా రుణాలేమైనా అందిస్తున్నారా?

వికలాంగుల కార్పొరేషన్ ద్వారా రూ.లక్ష నుంచి రూ.ఐదు లక్షల వరకూ స్వయం ఉపాధి కోసం రుణాలు అందిస్తున్నాము. ఈ ఏడాది పశ్చిమగోదావరి జిల్లాలో ముగ్గురికి ఇచ్చాము. ఏలూరు జిల్లాలో ఐదుగురికి ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నాము.

ప్రశ్న : డిస్ట్రిక్ట్ డిజేబుల్ డిజేబిటేషన్ సెంటర్ ద్వారా వికలాంగులకు ఎలాంటి సహాయ సహకారాలు అందిస్తున్నారు?

ఈ సెంటర్ ద్వారా వికలాంగులకు కృత్రిమ కాళ్లు, చేతులు, ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ వంటివి అందిస్తున్నాము. అంతేకాక ఆటోమేటెడ్ కృత్రిమ చేతులను అమర్చేందుకు ప్రస్తుతం అర్హులైన వారి వివరాలు సేకరించాము. ఇప్పటికే ఏలూరు జిల్లాలో 35 మందిని, పశ్చిమగోదావరి జిల్లాలో 27 మందిని గుర్తించాము.

ప్రశ్న : హిజ్రాల సంక్షేమానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

హిజ్రాలకు గుర్తింపు కార్డులు మంజూరు చేసి వారికి సింగిల్ రేషన్ కార్డు పొందేలా చర్యలు చేపట్టడం జరిగింది. అలాగే వారిని ఓటర్లుగా నమోదు చేసేందుకు చర్యలు చేపట్టాము. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే 137 మంది ఓటర్లుగా నమోదయ్యారు. సారిక అనే ఒక హిజ్రాను ఎన్నికల ఐకాన్‌గా గుర్తించి ఓటర్ల నమోదుకు కృషి చేయడం జరుగుతుంది.

ప్రశ్న : హిజ్రాలు ఎక్కువగా షాపింగ్ మాల్స్ దగ్గర, రహదారులపై భిక్షాటనకు మగ్గుచూపుతున్న పరిస్థితుల్లో వారిలో మార్పు తీసుకొచ్చేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

వారిలో స్వయం ఉపాధి వైపు ఎక్కువమంది మొగ్గుచూపేలా స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ఇస్తున్నాము. అలాగే వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వటం జరుగుతుంది. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే 22 మందికి ఇళ్లస్థలాలిచ్చాము. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా వారికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించి భిక్షాటన నుంచి వారిని బయటకు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నాము. 2019 ట్రాన్స్ జెండర్ చట్టాన్ని వివరించి వారి ప్రవర్తనలో మార్పు తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాము.

ప్రశ్న : హిజ్రాలకు ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్ ఏమైనా ఉందా? ఉద్యోగాల వైపు వారిని ఆకర్షించేలా ఏమైనా ప్రయత్నాలు జరుగుతున్నాయా?

హిజ్రాల్లో జన్యుపరమైన లోపాలు తప్పితే శారీరకపరమైన లోపాలు లేనందున వారికి ఎలాంటి రిజర్వేషన్ లేదు. కానీ ఇప్పుడిప్పుడే వారు ఉద్యోగాల వైపు ఆకర్షితులయ్యేలా అవగాహన కల్పించడం జరుగుతుంది. పోలీసు ఉద్యోగాలకు కొంతమంది దరఖాస్తు చేసినట్లు తెలిసింది.

ప్రశ్న : వికలాంగుల మానసిక ఉల్లాసానికి, వారిలో ప్రతిభను గుర్తించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

వారిలో మానసిక ఉత్తేజంతోపాటు ఆత్మస్థైర్యం, పోటీతత్వం పెంచి వారిలో ప్రతిభను గుర్తించేందుకు డిసెంబర్ మూడో తేదీన జిల్లాస్థాయి ఆటల పోటీలు నిర్వహిస్తున్నాము. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ఇవ్వడంతో పాటు విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతాము.

ప్రశ్న : చివరిగా వికలాంగులకు, వృద్ధులకు, హిజ్రాలకు మీరిచ్చే సలహా ఏంటి?

శారీరకంగా అయినా, మానసికంగా అయినా వైకల్యం అనేది ఉన్నప్పుడు దాన్ని లోపంగా భావించి కుంగిపోకూడదు. వైకల్యంతో ఉన్నప్పటికీ ప్రపంచ విజేతలుగా నిలిచిన వారు ఎందరో ఉన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని వైకల్యాన్ని జయించి, ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, సంక్షేమ కార్యక్రమాలు, రక్షణ చట్టాలు ఉపయోగించుకుని మంచి జీవనశైలిని అలవాటు చేసుకోవాలి. వైకల్యాన్ని జయించి విజేతలుగా నిలవాలి.



బాణసంచా విక్రయాలను ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ అబ్బయ్య చౌదరి

దీపావళి బాణసంచా విక్రయ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ ఆధ్వర్యంలో పెదపాడు మండలం వట్లూరు రైల్వేస్టేషన్ సమీపంలోని ప్రయివేటు రైస్ మిల్లు ఆవరణలో ఏర్పాటు చేసిన దీపావళి బాణసంచా విక్రయాల స్టాల్‌ను ఆదివారం దెందులూరు శాసనసభ్యులు కొఠారు అబ్బయ్య చౌదరి, డిసిఎంఎస్ ఛైర్మన్ వేంద్ర వెంకటస్వామి, శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ గుబ్బల తమ్మయ్య, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆళ్ల సతీష్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం డిసిఎంఎస్ ద్వారా దీపావళి బాణసంచా విక్రయాలు జరుగుతున్నాయని, నాణ్యమైన తక్కువ రేట్లకే సామాన్య ప్రజానీకానికి అందించాలని సదుద్దేశంతో బాణాసంచా కేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని, వీటిని ప్రజలందరూ ఉపయోగించుకోవాలని ఎంఎల్‌ఎ కోరారు. వేంద్ర వెంకటస్వామి మాట్లాడుతూ ప్రజలు దీపావళిని సంతోషంగా జరుపుకోవాలన్నారు. శివకాశీ నుండి స్టాండర్డ్ కంపెనీకి చెందిన బాణసంచాను హోల్‌సేల్ ధరలకే విక్రయిస్తున్నట్లు తెలిపారు. నాణ్యతా ప్రమాణాలతో కూడిన బాణసంచా అమ్మ కాలు జరుపుతున్నామని తెలిపారు. త్వరలో భీమవరం, నిడదవోలులో కూడా బాణా సంచా విక్రయ కేంద్రాలు ప్రారంభిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ బిజినెస్ మేనేజర్ విఎస్.కృష్ణమోహన్, ఎం..సుధాకర్, వెంకటేశ్వరరావు, వైసిపి నాయకులు గంటా ప్రసాద్, విఐసి సభ్యులు శ్రీనివాసరావు, కృష్ణారెడ్డి, లక్ష్మి, జగన్నాథరావు, రాఘవులు పాల్గొన్నారు.

సాగునీరు అందించి పంటలు కాపాడండి

మాట్లాడుతున్న డిఎన్‌విడి.ప్రసాద్

కలిదిండి: కైకలూరు నియోజక వర్గ స్థాయిలో నెలకొన్న రైతాంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఎం జిల్లా నాయకులు డిఎన్‌విడి.ప్రసాద్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాల యంలో కైకలూరు నియోజకవర్గ స్థాయి సిపిఎం కార్యకర్తల సమావేశం జరిగింది. కైకలూరు నియోజకవర్గంలో ముదినేపల్లి, కలిదిండి, మండవల్లి, కైకలూరు మండలాల కృష్ణా డెల్టా శివారు ప్రాంత ఆయకట్టు భూములకు సాగునీరందక వరి చేలు బీటలువారి రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. సాగునీటి కోసం రైతు కంట కన్నీరు వస్తుంటే నియోజకవర్గ ఎంఎల్‌ఎ ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. సాగునీటి కోసం రైతులు రాత్రీ,పగలు తేడాలేకుండా పొలాల గట్లపైనే పడిగాపులు పడాల్సిన దయనీయ పరిస్థితులు వచ్చాయన్నారు. పొట్ట, ఈనిక దశలో ఉన్న వరిపొలాలకు సకాలంలో నీరందకుంటే తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆవేదన చెందుతున్నారన్నారు. ఎకరాకు రూ.30 వేలు పెట్టుబడి పెట్టారని, కనీసం పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. నాలుగు మండలాల్లో పొట్ట దశలో ఉన్న వరి పొలాలకు సాగునీరందించి రైతాంగాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. కృష్ణా డెల్టాకు శివారు మండలాలు కావడం వల్ల రైతులు, కౌలు రైతుల బాధలు వర్ణనాతీతమన్నారు. 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాల్సి ఉండగా మొక్కుబడిగా నీటిని విడుదల చేయడం సరికాదన్నారు. పట్టి సీమ కాలువ నీటిని కృష్ణా కాలువకు యుద్ధ ప్రాతిపదికన మళ్లించి వరి పొలాలను కాపాడాలన్నారు. లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. సిపిఎం మండల కార్యదర్శి శేషపు మహంకాళిరావు, నాయకులు జక్కుల మహేష్, వీరవల్లి భాస్కరరావు, జ్ఞానేష్, సత్యనారాయణ, అనిల్ పాల్గొన్నారు.

7న సిపిఎం ప్రజారక్షణ భేరిని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

కేంద్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో రాష్ట్రానికి ఇచ్చిన ఏ ఒక్క హామీనికి అమలు చేయలేదని, ప్రత్యేక హోదా, విభజన హామీలు, విశాఖ, కడప ఉక్కు పరిశ్రమల అంశాలను గాలికొదిలేసిందని, పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి విమర్శించారు. ఈ నేపథ్యంలో సిపిఎం చేపడుతున్న ప్రజారక్షణ భేరి బస్సుయాత్ర వచ్చేనెల ఏడో తేదీన కొయ్యలగూడేనికి చేరుకుంటుదని, ఈ యాత్రను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రవి ఆదివారం మాట్లాడుతూ సిపిఎం రాజకీయ విధానాన్ని ప్రజలకు చెప్పడం, ప్రజా సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయం, ప్రజా ప్రణాళిక వంటి 31 డిమాండ్లను ప్రజలకు వివరించే కార్యాచరణతో ప్రజా రక్షణ భేరి బస్సు యాత్ర నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండాగా ఈనెల 30 నుంచి రాష్ట్రంలో మూడు బస్సు యాత్రలు ప్రారంభం కానున్నాయని చెప్పారు. కర్నూలు జిల్లా ఆదోని, శ్రీకాకుళం జిల్లా మందస పార్వతీపురం, మన్యం జిల్లా సీతంపేట నుంచి విజయవాడ వరకూ బస్సు యాత్రలు జరగనున్నాయన్నారు. వచ్చేనెల 15వ తేదీన విజయవాడలో ప్రజా రక్షణ భేరి బహిరంగ సభ జరుగుతుందన్నారు. సిపిఎం మండల కార్యదర్శి శుక్ల బోయిన రాంబాబు మాట్లాడుతూ ఏడో తేదీన కొయ్యలగూడేనికి బస్సు యాత్ర రానుందని, ఉదయం ఎనిమిది గంటలకు జంగారెడ్డిగూడెం రోడ్‌లో సభ నిర్వహిస్తున్నామని, ఈ సభకు పార్టీ కార్యకర్తలు, సానుభూతిపరులు, ప్రజాసంఘాలు అన్ని రంగాల కార్మికులు పెద్దఎత్తున పాల్గొని ఈ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రజారక్షణ భేరి స్టిక్కర్లు, కరపత్రాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు గుడెల్లి వెంకటరావు, మండల నాయకులు బ.దుర్గారావు, ఎస్.శివకుమార్, సిహెచ్.మరిడియ, పిల్లా తమ్మారావు, మద్రి త్రిమూర్తులు, జి.గోపి, పి.సురేష్, రాచూరి దుర్గారావు, రాచూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు కృషి

యుటిఎఫ్ ఉంగుటూరు మండల కమిటీ ఎన్నిక

మండల శాఖ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - ఉంగుటూరు

ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు ప్రతిఒక్క ఉపాధ్యాయుడు కృషి చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ముస్తఫా అలీ తెలిపారు. తెలిపారు. యుటిఎఫ్ ఉంగుటూరు మండల శాఖ నూతన కౌన్సెల్ సమావేశం శనివారం రాత్రి నారాయణపురం హైస్కూల్‌లో మండల అధ్యక్షుడు ఉనుముల రాంబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అలీ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తూ ప్రభుత్వ విద్యా వ్యవస్థను నాశనం చేస్తుందన్నారు. పోరాటాల ద్వారా మాత్రమే ఈ నిరంకుశ వైఖరిని తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. మండల నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఉనుముల రాంబాబు, డి.జోగినాయుడు, గౌరవ అధ్యక్షునిగా శీతాల సత్యనారాయణ, సహధ్యక్షులుగా కె.హరికృష్ణ, ఎ.వాణి, కోశాధికారిగా ఆనంద్ కుమార్, ఆడిటర్‌గా టి.శ్రీధర్, కార్యదర్శులుగా కె.శ్రీనివాస్, పివి.కన్నారావు, ఆకుల భవానీశ్వరరావు, బి.కృష్ణవేణి, సిఎచ్‌కె.రాణి, టి.శివయ్య, కె.ప్రేమ్ కుమార్, డి.లక్ష్మీనారాయణ, కె.వెంకటేష్, బి.రత్నకిషోర్, ఉపేంద్ర, శివ కుమార్, సోమరాజు జిల్లా కౌన్సెలర్లుగా జి.రామారావు, అల్లు శ్రీనివాసరావు, కె.రత్న కుమార్, పుప్పాల నరసింహారావు, ఆర్‌కెవిఎన్, పిరిడి ప్రసాద్, బొమ్మిడి ప్రసాద్, కె.నాగ పరమేశ్వరి, కె.జాన్సీరాణి, బి.సీతా మహాలక్ష్మి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా పూర్వపు ప్రధాన కార్యదర్శి పివి.నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సిహెచ్ శ్రీధర్, కె.కమల్ కుమార్, జిల్లా అడిట్ కన్వీనర్ బి.మోహన రావు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ ఆపాలి

ఏలూరు అర్బన్ : విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రెయివేటీకరణ ఆపాలని, కడప జిల్లాలో ఉక్కు కర్మాగారాన్ని నెలకొల్పాలని డిమాండ్ చేస్తూ వచ్చేనెల 8వ తేదీన విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌కి పిలుపునివ్వడం జరిగిందని విద్యార్థి యువజన సంఘాల నాయకులు తెలియజేశారు. ఈమేరకు ఆదివారం స్థానిక పిడిఎస్‌యు జిల్లా కార్యాలయంలో విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు ఇ.భూషణం మాట్లాడుతూ అనేక మంది ప్రజల పోరాటాల ఫలితంగా సాధించుకున్నటువంటి విశాఖ ఉక్కు పరిశ్రమని ఈరోజు నష్టాల్లో ఉందనేటువంటి సాకు చూపించి కేంద్ర ప్రభుత్వం ప్రెయివేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టాలని చూస్తుందన్నారు. కారు చౌకగా పరిశ్రమను కట్టబెట్టాలని చూడడం దుర్మార్గమన్నారు. విశాఖ పరిశ్రమ ప్రెయివేటీకరణ చేయడం వల్ల ఈరోజు లక్షలాదిమంది ప్రత్యక్షంగా, పరోక్షంగా వారి జీవనోపాధిని కోల్పోయే ప్రమాదం ఉందని భూషణం తెలియజేశారు. అందువల్ల నవంబర్ 8వ తేదీన రాష్ట్రవ్యాప్త బంద్‌కి పిలుపు ఇచ్చారు. కావున తల్లిదండ్రులు, విద్యార్థులు, యాజమాన్యాలు ఈ బంధుకు సహకరించాలని కోరారు. ఎవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.లెనిన్ బాబు మాట్లాడుతూ దాదాపు 50 సంవత్సరాలు కావస్తున్నా నేటికీ విశాఖ ఉక్కు పరిశ్రమకు సొంత గనులు కేటాయించకపోవడం చాలా హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్ బాబు మాట్లాడారు.

విలువలు పెంపొందించే శక్తి ఉపాధ్యాయులకే సాధ్యం

పలువురికి గురు స్పందన అవార్డులు

ప్రజాశక్తి - ఉంగుటూరు

యువతలో నిరాశ, నిస్పృహలు, ఆత్మహత్యలను నివారించడంలో మంచి విలువలు పెంపొందించే శక్తి ఉపాధ్యాయులకే సాధ్యమని స్పందన ఈద ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సంస్థ వ్యవస్థాపకులు సామ్యుల్ రెడ్డి తెలిపారు. సామ్యుల్ రెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు గురు స్పందన అవార్డు కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఎమ్ఎల్‌సి షేక్ షాబ్జీ ముఖ్య అతిథిగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. ఎమ్ఎల్‌సి షాబ్జీ, జిల్లా విద్యాశాఖాధికారి శ్యామ్ సుందర్ చేతుల మీదుగా ఉంగుటూరు ఉపాధ్యాయులు శీతాల సత్యనారాయణ, అల్లు శ్రీనివాసరావు, ఎవిఎస్.రాజు, గొల్లపల్లి గవరయ్య, వునుముల రాంబాబు, గుదే శ్రీనివాస్, గొర్రెల వెంకట సత్యవతి, ఓ.ఆనందకుమార్, దారపురెడ్డి శ్రీనివాసరావు, కె.ప్రేమ్ కుమార్, తూతిక శివయ్య, షేక్ ఫరీద, జహీరున్నీషా బేగంలకు ఏలూరులో అవార్డులు ప్రధానం చేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్పందన ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఛైర్మన్ సామ్యుల్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి డాకి జోగినాయుడు, కిషోర్ కుమార్, సాయిరామకృష్ణ, చంద్రిక రెడ్డి, పురస్కార గ్రహీతలు పాల్గొన్నారు.



పురస్కారాలతో ఉపాధ్యాయులు..

రేపు జాబ్‌మేళా

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

ఏపి స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 31వ తేదీన నూజివీడులోని శారదా డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నారు. 14 కంపెనీలు ఈ జాబ్ మేళాకు హాజరవుతాయని, ఎస్ఎస్‌సి, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగులు జాబ్ మేళాని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఈమేరకు ప్రకటన విడుదల చేశారు.

రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే.. ప్రభుత్వం మారాలి

ప్రజాశక్తి - చాట్రాయి

మాజీ ఎంఎల్ఎ చిన్నం రామకోటయ్య మరోసారి నూజివీడు నియోజకవర్గం నుంచి రాజకీయ రంగ ప్రవేశం చేస్తూ ఆదివారం చాట్రాయి మండలం జనార్దన వరం, ఆగొల్లను పేట గ్రామ ప్రజలకు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్లు ఉన్నదన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి చెందాలంటే అధికార మార్పిడి ఒకటే మార్గం అని తెలియజేస్తూ రాబోయే రోజుల్లో ఇండిపెండెంట్‌గా పోటీ చేయటం ఒకటే పరిష్కార మార్గం అన్నారు. ప్రజా మద్దతును తెలపాలని రెండు గ్రామాల ప్రజలకు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు.


సాగర్‌బాబును సన్మానిస్తున్న సంఘ సభ్యులు

కృషి, పట్టుదలతో ఉన్నత శిఖరాలకు..

ఐఆర్ఎస్‌లో ఎంపికైన సాగర్‌బాబు

ప్రజాశక్తి - ఉంగుటూరు

విద్యార్థి స్థాయి నుంచే ఎంచుకున్న రంగంలో పట్టుదలతో కృషి చేస్తే ఉన్నత శిఖరాలను సులభంగా అధిరోహించవచ్చని సెంట్రల్ బోర్డ్ డైరెక్టర్ ఆఫ్ టాక్సెస్ అసిస్టెంట్ కమిషనర్ యార్ల సాగర్ బాబు తెలిపారు. ఆదివారం మండలంలోని పెద వెల్లమిల్లి గ్రామంలోని షాలెమ్ పెంతెకోస్తు ప్రార్థన మందిరంలో పాస్టర్ ఇస్సాయేల్ అధ్యక్షతన సాగర్ బాబును ఘనంగా సంఘ సభ్యులు సత్కరించారు. జంగారెడ్డి గూడెం మండలం జొన్న వారి గూడెంకు చెందిన సాగర్ బాబు జీవిత ప్రయత్నం ప్రకటించిన సివిల్ ఫలితాల్లో ఇండియన్ రెవెన్యూ సర్వీస్‌కు ఎంపిక అయ్యారు. ఈ సందర్భంగా సాగర్‌బాబును సన్మానించారు. అసిస్టెంట్ కమిషనర్ సాగర్ బాబు మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో యువత భాగస్వాములు కావాలన్నారు. ఎంచుకున్న రంగంలో విజయం సాధించేందుకు ప్రభుత్వం అందిస్తున్న విద్యా వనరులను సద్వినియోగం చేసుకొని ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగాలని యువతకు సూచించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ తల్లిదండ్రుల ఆశయాలను వమ్ము చేయకుండా విజయం సాధిస్తే సమాజంలో తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. కష్టాలను అధిగమించి చిన్నస్థాయి నుంచి ప్రభుత్వ పాఠశాలలో కష్టపడి చదివి ఈ స్థాయికి వచ్చానని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఉండడం వల్ల సొంతంగా ప్రిపేర్ అయ్యి ఐఆర్ఎస్ సాధించానని తెలిపారు. అపజయాలను చూసి భయపడకుండా ముందుకు వెళితే విజయం సాధించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు, యువత పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

నాటుసారా విక్రేత అరెస్టు

ప్రజాశక్తి - ముసునూరు

ఓ మహిళ వద్దనుంచి ఐదు లీటర్ల నాటు సారాయి కేసు తీసుకుని వెళుతుండగా పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేసి అరెస్టు చేసిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వేల్పుచర్ల గ్రామంలో శనివారం రాత్రి ముసునూరు ఎస్ఐ ఎం.కుటుంబరావు, ఇద్దరు కానిస్టేబుళ్లతో కలిసి బీట్ నిర్వహిస్తుండగా ఓ మహిళ పోలీసులను చూసి ఆ కేసు రోడ్డు పక్కనే ఉన్న చెత్తలో దాసి వెళుతుండగా పోలీసులు పట్టుకుని వివరాలు అడగారు. తాము వేల్పుచర్ల గ్రామంలో హోటల్ నిర్వహిస్తున్నామని, అధిక మొత్తంలో డబ్బు సంపాదించాలనే నేపథ్యంలో అక్రమ సారాయి అమ్ముతున్నట్లు ఆమె తెలపడంతో, ఆమె పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రెండు లీటర్ల నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి - టి.నరసాపురం

నాటుసార అక్రమ నిల్వ కలిగి వున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లుగా ఎస్ఐ బి.సురేంద్ర కుమార్ ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బొర్రంపాలెం గ్రామానికి చెందిన బైగాని విశ్వేశ్వరరావు అక్రమంగా నాటుసార నిల్వలు ఉంచాడన్న సమాచారంతో తన సిబ్బందితో దాడి చేసి రెండు లీటర్ల నాటుసార స్వాధీనం చేసుకుని, అతనిపై కేసు నమోదు చేసినట్లుగా ఆయన తెలిపారు.

వివాహిత మృతి ఘటనలో వ్యక్తిపై కేసు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

వివాహిత యువతి ఆత్మహత్య చేసుకుని మృతి చెందడంపై కేసు నమోదు చేశామని ఎస్ఐ మల్లికార్జున రెడ్డి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా జగ్గయ్యపేట సమీపంలోని క్రిష్టారం గ్రామానికి చెందిన విజయలక్ష్మి(19) అనే వివాహిత ఆదివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడింది. స్థానిక రామచంద్రపురం కేపి టవర్స్‌పై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలు విజయలక్ష్మికి పట్టణానికి చెందిన అనిల్‌కుమార్‌కు నెల క్రితం వివాహం జరిగింది. దసరా పండుగ నేపథ్యంలో అనిల్‌కుమార్, భార్య విజయలక్ష్మి జంగారెడ్డిగూడెం వచ్చారు. అయితే వీరి ఇల్లు కేపీ టవర్స్ వెనుక ఉన్న రోడ్డులో ఉంది. ఈ క్రమంలో లక్ష్మి కేపీ టవర్స్ ఎక్కి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలు తెలియాల్సి ఉంది. స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించగా, అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అనిల్ కుమార్ భార్య విజయలక్ష్మితో వైజాగ్‌లో నివశిస్తుండగా, అక్కడే ఒక ప్రెయివేట్ సంస్థలో అనిల్‌కుమార్ ఉద్యోగం చేస్తున్నాడు. మృతురాలి తండ్రి ఈశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇద్దరు విద్యార్థులు అదృశ్యం

ప్రజాశక్తి - కుక్కునూరు

ఇద్దరు విద్యార్థులు అదృశ్యమైన సంఘటన మండలంలోని బెస్తగూడెం గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం బెస్తగూడెం గ్రామానికి చెందిన టి.రమ్య, ఉంగుటూరి సౌమ్య వేలేరుపాడు మండలంలోని కస్తూరిబా గాంధీ హాస్టల్‌లో తొమ్మిదవ తరగతి చదువుతున్నారు. కాగా దసరా సెలవుల్లో సొంతూరైన బెస్తగూడెం వచ్చారు. శనివారం వీరిద్దరూ కలిసి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఏటో వెళ్లిపోయారు. వీరి ఆచూకీ కోసం ప్రయత్నం చేయగా బెస్తగూడెం గ్రామానికి చెందిన దానూరి శ్రావణితో వెళ్లినట్లుగా తెలిసింది. విద్యార్థుల తల్లి ఉంగుటూరి పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ శ్రీనివాసరావు తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - టి.నరసాపురం

ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో వ్యక్తి టెక్కం శ్రీనివాస్(45) మృతి చెందిన సంఘటన మండలంలోని కా పుగూడెం గ్రామంలో శనివారం చోటు చేసుకోగా ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సంఘటనపై గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం కాపుగూడెం గ్రామానికి చెందిన టెక్కెం శ్రీనివాస్ శనివారం ఉదయం 6 గంటల సమయంలో గ్రామానికి సమీపంలో ఉన్న పొలానికి వెళ్లాడు. ఈ క్రమంలో పొలానికి ఉన్న ఇనుప ఫెన్సింగ్‌లో నుంచి పొలంలోకి వెళుతుండగా అప్పటికే ఫెన్సింగ్ తీగలకు విద్యుత్ సరఫరా కావడంతో విద్యుత్ షాక్‌తో శ్రీను అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

'చింతలపూడి'పై డెంగీ పంజా..!

మండలవ్యాప్తంగా అధికారికంగా ఐదు కేసులు నమోదు

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలో చాపకింద నీరులా డెంగీ కేసులు నమోదు అవుతున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల కంటే ప్రెయివేట్ ఆసుపత్రుల్లోనే ఎక్కువ మంది వైద్యం తీసుకుంటున్న పరిస్థితి. మండలంలోని గ్రామాలలో పారిశుధ్య, శానిటేషన్, దోమల నివారణ పిచికారి మందులు జాడ కనిపించని పరిస్థితి. కనీసం బ్లీచింగ్ కూడా చల్లకపోవటంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. గతంలో కనీసం గ్రామాలలో బ్లీచింగ్ చల్లేవారు. ప్రస్తుతం వాటి గురించి పట్టించుకునే నాథులే లేరు. ప్రజలు జ్వరాల భారిన పడుతున్నా కనీసం పట్టించుకోవటం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ సిబ్బంది, మండల అధికారులు గ్రామాలలో డ్రెయినేజీలు, మురికి నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవటం లేదు. దోమల వ్యాప్తికి చర్యలు తీసుకోకపోవడంతో విమర్శలు వెలువెత్తుతున్నాయి.

మండలం మొత్తం 5 డెంగీ కేసులు నమోదు అయినట్లు ఎంపిహెచ్ఒ శ్రీను వెల్లడించారు. అధికారికంగా 5 కేసులు అయినా, ప్రెయివేట్ హస్పటల్లో అనాధికారంగా మరో 5 కేసులు నమోదు అయినట్లుగా తెలుస్తుంది. మండలంలో చింతంపల్లి, వైఎస్ కాలనీ, లింగగూడెం, యర్రగుంటపల్లి గ్రామాలలో కేసులు నమోదు అయినట్లుగా తెలుపుతున్నారు. ముఖ్యంగా యర్రగుంటపల్లి పంచాయతీలో ఎస్‌సి కాలనీ, రోడ్డు మీద మురికినీరు వెళ్లటం, డ్రెయినేజీలు కనీసం బ్లీచింగ్ చల్లించకపోవటంతో ఎక్కువ మంది జ్వరాల బారిన పడినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. యర్రగుంటపల్లి, చింతంపల్లి, వైఎస్ కాలనీల్లో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయలని ఆ గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు.

డెంగ్యూతో చిన్నారి మృతి

మండలానికి చెందిన ఎనిమిదేళ్ల చిన్నారి డెంగీతో ప్రెయివేట్ హాస్పటల్‌లో వైద్యం తీసుకుంటూ రెండు వారాల క్రితం మృతి చెందింది. అప్పటి వరకు కనిపించని శానిటేషన్ పనులు వైద్య సిబ్బంది తర్వాత చిన్నారి ఇంటి దగ్గర నిర్వహిస్తుండగా తండ్రి మా ఇంటి వద్దనే కాదు, కాలనీ మొత్తం చేయించాలని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇదేవిధంగా వైఎస్ కాలనీకి చెందిన గణేష్ డెంగ్యూ జ్వరంతో ఇబ్బందులు పడుతున్నాడు.

కనిపించని ఫాగ్ మిషన్లు

ప్రభుత్వం ఎంతో వ్యయంతో దోమల నియంత్రణకు ఫాగ్ మిషన్లు ప్రతీ పంచాయతీకి అందజేశారు. ఫాగ్ మిషన్లు అసలు వాడుతున్నారా? తుప్పు పట్టి నిరూపయోగంగా ఉన్నాయా తెలియని పరిస్థితి నెలకొంది. మండలానికి 21 ఫాగ్ మిషన్లు అందజేశారు. ఆ ఫాగ్ మిషన్ ఇచ్చినప్పుడే తప్ప మిగతా ఏ సందర్భంలోనూ ఫాగ్ మిషన్లు కనిపించని పరిస్థితి. గ్రామాలలో చెత్త ఎక్కడికక్కడే పేరుకుపోవటం, డ్రెయినేజీలు అపరిశుభ్రంగా ఉండటంతో దోమలు పెరిగిపోతున్నాయని చెబుతున్నారు. దోమల నివారణకు కనీసం చర్యలు తీసుకోవటం లేదని ప్రజలు బహిరంగానే విమర్శిస్తున్నారు. ఇప్పటికే వివిధ రకాల జ్వరాలతో ప్రజలు బాధ పడుతున్నారు. అధికారులు దోమల నివారణకు స్ప్రే చేయించటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమల దాటికి ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారన్నారు. దోమలు కుట్టటం వల్ల మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాలు వస్తాయేమోనని వాపోతున్నారు. ఉన్నతాధికారులు గ్రామాలలో శానిటేషన్, బ్లీచింగ్ చల్లించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

మండలంలో పనిచేసే సెక్రటరీలకి అదనంగా రెండు మూడు పంచాయతీలు ఇవ్వటంతో ఏ పంచాయతీపై దృష్టి పెట్టాలో తెలియని పరిస్థితి. యర్రగుంటపల్లి, నామవరం, సీతానగరం, ఉర్లగూడెం, యర్రగుంటపల్లి పంచాయతీలకు ఒక్కరే సెక్రటరీ ఉండటంతో ఒత్తిడితో ఏ పంచాయతీ మీద దృష్టి కేంద్రీకరించాలో తెలియట్లేదని వారు వాపోతున్నారు. అదేవిధంగా లింగగూడెం, చింతంపల్లి పంచాయతీలు ఇదే దుస్థితి.

శానిటేషన్ చేయించడం లేదు

చిపురు రమేష్, శెట్టివారిగూడెం జనసేన వార్డు మెంబరు

గ్రామాలలో శానిటేషన్ చేయించటం లేదు. అదేవిధంగా దోమల నివారణకు చర్యలు తీసుకోవడం లేదు. ఉన్నతాధికారులు అన్ని గ్రామాలలో శానిటేషన్ చేయించాలని మనవి.

పారిశుధ్యంపై అధికారులు దృష్టి పెట్టాలి

సోమశేఖర్, యర్రగుంటపల్లి

వైరల్, టైఫాయిడ్, డెంగీ జ్వరాలు పెరుగుతున్నాయి. పారిశుధ్యంపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలి. అదేవిధంగా ప్రతీ వీధిలో బ్లీచింగ్, దోమల నివారణకు పిచికారీ చేయించాలి. గ్రామంలో మెడికల్ క్యాంపు నిర్వహిస్తే బాగుటుంది.

అవగాహన కల్పిస్తునాం..

ఎంపిహెచ్ ఇఒ, శ్రీను

మండలంలో 5 డెంగీ కేసులు నమోదు అయ్యాయి. ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

పారిశుధ్యంపై దృష్టి పెడతాం

ఇఒపిఆర్‌డి, విక్టర్ బాబు

మండలంలో 21 ఫాగ్ మిషన్లు ఉన్నాయి. టెక్నికల్, మెకానికల్ సమస్యల వల్ల వాటిని ఉపయోగించటం సాధ్యపడటం లేదు. అవి మొత్తం తీసుకువచ్చి, ఆ సమస్యను పరిష్కరిస్తాం. గ్రామలలో పారిశుధ్యంపై దృష్టి పెడతాం.

నీరులేక జీవాలకు ముప్పు

ప్రజాశక్తి - చింతలపూడి

వర్షాభావం వరి, పత్తి, బంతి సాగులపై కాకుండా వలస పక్షులు, పశువులపై ప్రభావం చూపుతుంది. వరిపంట వర్షాలు లేక ఎండిపోవటంతో చెరువులలో నీరు మోటర్లు పెట్టి తోడైయటంతో, చెరువులు ఎండిపోతున్న పరిస్థితి నెలకొంది. దీంతో చెరువులు మీద ఆధారపడి బతికే పక్షులు, పశువులకు ఇబ్బంది కల్గుతుంది. మండలంలో చుట్టు పక్కల చెరువులు ఎండిపోవటంతో ముక్కంపాడు గ్రామ సమీపంలో ఉన్న చెరువు వద్దకు పక్షులు వలస వస్తున్నాయి. కనీసం పశువులకు, పక్షులకు నీరు లేకపోతే వాటి పరిస్థితి ఏంటని పశువుల కాపరిలు ఆందోళన చెందుతున్నారు. ఇక వలస పక్షుల పరిస్థితి ఏంటని ప్రశ్నార్థకంగా మారింది.


వలస వచ్చిన పక్షులు..

ముక్కంపాడు చెరువు..

స్వామిత్వ సర్వేకు నాలుగు గ్రామాలు ఎంపిక

ముదినేపల్లి : స్వామిత్ర సర్వేకు మండలంలో తొలి విడతలో నాలుగు గ్రామాలను ఎంపిక చేసినట్లు ఇఒపిఆర్‌డి దూలం లక్ష్మీనారాయణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని అల్లూరు, పెదకామనపూడి, ఈడేపల్లి, సంకర్షణపురం గ్రామాలు సర్వేకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఆయా గ్రామాల్లో నివాస ప్రాంతాలపై ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం ద్వారా రీసర్వే జరుగుతుందన్నారు. గ్రామ కంతల్లోనే స్థలాలకు సర్వే నంబర్లు కూడా పొందుపరుస్తారన్నారు. ఇప్పటి వరకు చాలా గ్రామాల్లో గ్రామ కంతాల్లోనే స్థలాల రిజిస్ట్రేషన్లకు ప్రజలు ఇబ్బందులు పడే వారిని, ఈ సర్వే అనంతరం నివాస ప్రాంతాల రిజిస్ట్రేషన్లకు అవకాశం కలుగుతుందన్నారు. సర్వేలో గ్రామాల మ్యాప్‌కు సంబంధించిన అన్ని అంశాలు తెలుస్తాయని, ప్రభుత్వ భూములను కూడా గుర్తించడం జరుగుతుందని తెలిపారు.

హేలాపురి కళాకారుల నూతన కమిటీ ఎన్నిక

ఏలూరు అర్బన్ : హేలాపురి కళాకారుల సంక్షేమ సంఘం ఏలూరు సంస్థకు 3 సంవత్సరాల కాలపరిమితికి ఆదివారం ఏలూరు వైఎంహెచ్ఎ హాలులో జరిగిన సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. హేలాపురి కళాకారుల సంక్షేమ సంఘం గౌరవ సలహాదారులుగా డా.మోదుగు కృష్ణారావు, డా.లంకా వెంకటేశ్వర్లు, కడిమి గోవిందరావు, పైడి భీమేశ్వరరావు, అధ్యక్షులుగా పెదపాటి రామకృష్ణ, ఉపాధ్యక్షులుగా పి.విజయ్ కుమార్, వల్లముల రామాంజనేయులు, మహమ్మద్ ఖాజావలి, ప్రధాన కార్యదర్శిగా నాట్యాచార్య గండికోట రాజేష్, సహాయ కార్యదర్శులుగా సంకు సురేష్, మండవ రాజ గోపాలకృష్ణ, వై.అర్జున రావు కార్యనిర్వాహక కార్యదర్శులుగా ఘంటసాల పెద్దిరాజు, ఎం.సూర్యనారాయణ యాదవ్, ఎస్.కస్తూరి రావు, పచ్చ కృష్ణానందరావు, కోశాధికారిగా కొచ్చర్లకోట వెంకట సుబ్బారావు, ఎగ్జిక్యూటీవ్ కమిటీ మెంబర్స్‌గా టి.లోకేష్, సిహెచ్.లలిత కుమారి, డా.ఆరేపల్లి రవిప్రకాష్, పి.సూర్య ప్రకాష్, కె.శ్రీదేవి, ఎ.రంగబాబు, నక్కా ఆంజనేయులు ఎన్నికయ్యారు.

31న ఎఐటియుసి వ్యవస్థాపక దినోత్సవం

జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరావు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఎఐటియుసి 104వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఈనెల 31వ తేదీని ఎఐటియుసి అనుబంధ ఉద్యోగ కార్మిక సంఘాల కార్మిక హక్కుల పరిరక్షణ దినంగా జరపాలని ఎఐటియుసి జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఎఐటియుసి జెండాలు ఎఐటియుసి కార్యాలయాలు, కార్మిక ప్రాంతాలలో ఆవిష్కరించి సభలు, సమావేశాలు జరపాలని ఆయన కోరారు. ఎఐటియుసి 103 సంవత్సరాలుగా సాధించిన హక్కులను, రాయితీలను కేంద్ర మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాల మార్పు పేరుతో కాల రాస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రెయివేటీకరణ విధానాలను వ్యతిరేకిస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను, పరిశ్రమలను కాపాడుతామని, విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని కోరుతూ కార్మికవర్గం ఎఐటియుసి వ్యవస్థాపక దినం రోజున ప్రతిజ్ఞ చేయాలని ఆయన తెలిపారు.

బూరుగూడెంలో 'జగనన్నే మా నమ్మకం'

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని బూరుగుగూడెం గ్రామంలో ఎపి కోఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్ దేశి రెడ్డి రాఘవరెడ్డి ఆధ్వర్యంలో శనివారం రాత్రి జగనన్నే మా నమ్మకం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నూజివీడు నియోజకవర్గ ఎంఎల్ఎ మేక వెంకట ప్రతాప్ అప్పారావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ రాష్ట్రంలో ఆరు నెలలో ఎలక్షన్స్ రాబోతున్నాయన్నారు. 2024 ఎన్నికల్లో 175 కు 175 స్థానాలు గెలుచుకొని మరలా జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అవుతారని, అందుకు సందేహమే లేదన్నారు. గతం కంటే నూజివీడు నియోజకవర్గంలో అత్యధిక మెజారిటీ సాధించాలని, అందుకు సచివాలయం పరిధిలో గృహ సారధులు, వాలంటీర్లు, లోకల్ నాయకులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. రాష్ట్రంలో ఆనాటి కాంగ్రెస్‌కి వ్యతిరేకంగా మహానుభావుడు ఎన్‌టి రామారావు టిడిపిని స్థాపించారని, ఆయన స్థాపించిన పార్టీ నేడు లేదన్నారు. తెలంగాణలో టిడిపి భూస్థాపితం అయ్యిందని, కాంగ్రెస్‌ను కూడా ముంచేసిందని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు పుచ్చకాయల సుబ్బారెడ్డి, దామెర ప్రసాద్ బాబు, కారంగుల శ్రీనివాసరావు, చలికాని బాబ్జి, మండల అధ్యక్షులు మిద్దె బాలకృష్ణ, గ్రామ సర్పంచులు మిద్దె శివాజీ, తిరివీధి రమేష్, పర్సా సత్యనారాయణ, ఎంపిటిసిలు పోతిరెడ్డిపల్లి కృష్ణ, కంచర్ల వెంకయ్య, దారా ఆనంద్ సోని, అన్ని గ్రామాల వాలంటీర్లు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంఎల్ఎ మేక

కళ్లకు గంతలతో టిడిపి నేతల నిరసన

ప్రజాశక్తి - ముసునూరు

చంద్రబాబు నాయుడుకి రాష్ట్ర ప్రభుత్వం వేసిన సంకెళ్లు బద్దలు కావాలంటూ ఆదివారం రాత్రి మండలంలోని 16 గ్రామాల టిడిపి నాయకులు కళ్లకు గంతలు కట్టుకుని నిజం గెలవాలి అని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గద్దె రఘుబాబు, కొల్లి గంగారామ్, మండలపు ధర్మరాజు, బుజ్జియ్య, కృష్ణారావు, భాను, గిరి, రాపర్ల ప్రతాప్, రాపర్ల బాలకృష్ణ, గద్దల సుహాసిని మోహనరావు, పర్వతనేని వెంకటేశ్వరరావు, సొంగా ఇస్సాక్, వేంపాటి సత్యనారాయణ, వేంపాటి శ్రీనివాసరావు, కాటేపల్లి సత్యనారాయణ, మల్లిబాబు, రంగు వాసు, గార్లపాటి నరసింహారావు, పాకనాటి సీతారామ్, పాకనాటి ఆంజనేయులు, తోట శ్రీనివాసరావు, తదితరులు నిరసన వ్యక్తం చేశారు.

ముసునూరులో..

కలిదిండి : చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా మండలంలోని మట్టగుంటలో టిడిపి రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి అంద్రాజు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కళ్లకు గంతలు కట్టుకుని నిజం గెలవాలి అని నినాదాలు చేశారు.

జంగారెడ్డిగూడెం : చంద్రబాబు నాయుడుని విడుదల చేయాలని కోరుతూ టిడిపి శ్రేణులు వినూత్న నిరసన తెలిపారు. ఆదివారం టిడిపి మండల, పట్టణ కమిటీల ఆధ్వర్యంలో కళ్లకు గంతలు కట్టుకుని చంద్రబాబు నాయుడుకి మద్దతుగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మండల టిడిపి అధ్యక్షులు సాయిల సత్యనారాయణ మాట్లాడుతూ నిజం గెలవాలి చంద్రబాబు నాయుడు విడుదల కావాలని నినదించారు. వైసిపి ప్రభుత్వం కక్ష సాధింపు చేస్తూ చంద్రబాబు నాయుడుని అక్రమంగా అరెస్ట్ చేశారని తెలిపారు. ప్రజలంతా చంద్రబాబు నాయుడుకి మద్దతు గా నిలుస్తూన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగు యువత అధ్యక్షులు గోలి అనిల్, గ్రామ పార్టీ అధ్యక్షులు సింహాద్రి రవి, పూలమోలు బాబురావు, బలుసు కిరణ్, చదలాటి సుబ్రమణ్యం, మూలకాల కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

కలిదిండిలో..

తనిఖీ చేస్తున్న డిపిఒ

పుట్లగట్లగూడెంలో డిపిఒ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని పుట్లగట్లగూడెం పంచాయతీ కార్యాలయాన్ని డిపిఒ శ్రీనివాస విశ్వన్యాద్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఆదివారం క్షేత్రస్థాయిలో జరుగుతున్న స్వమిత్వ గృహాల సర్వేను తనిఖీ చేసి కొలతలు నమోదు చేశారు. అనంతరం గ్రామంలో ప్రగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా డిపిఒ మాట్లాడుతూ స్వమిత్వ సర్వే ద్వారా ప్రజలకు ఎంతో మేలని అన్నారు. ప్రభుత్వ ప్రధాన అజెండా అంశమైన స్వమిత్వ సర్వేని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాలతో గడువు లోపు పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

దస్తావేజు పోయినది

ఇందుమూలముగా యావన్మంది ప్రజలకు తెలియజేయునది ఏమనగా మా క్లయింటు శ్రీవత్సవాయి సీతారారాజు గారి కుమారుడు వెంకట సూర్యనారాయణరాజు ది.26-10-2023వ తేదీన అనగా గురువారము ఉదయం గం॥11:00 సమయమున ఏలూరు జిల్లా, ఏలూరు పట్టణమునందు ఆర్.ఆర్.పేట నుండి ఫైర్ ఆఫీసు సెంటరుకు వెళ్ళే దారిలో **2847/1987 దస్తావేజు పోగొట్టుకునియున్నాడు.** కావున ఎవరికైనా దొరికిన ఎడల ఈ నెంబరుకి 98486 05066 తెలియజేయగలరు.

కె.ఆర్.కె.చౌదరి (బాబి)
అడ్వకేట్, సోమవరప్పాడు, ఏలూరు.
సెల్: 98486 05066

ప్రకటన

మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఓ.ఎస్.నెం. 192/2019

బిట్వీన్:

వాది: త్రిపురారి బుచ్చిరాజు

అండ్

ప్రతివాది: ఉల్లి కృష్ణ, తండ్రి: ఈశ్వరరావు, ముచ్చర్లవారి వీధి, పాలకొల్లు.

ఈ నెంబరు దావాలో ప్రతివాదికు ఎన్ని పర్యాయములు దావా సమన్లు పంపించిననూ అతను తీసుకొనక వాదిని చిక్కులు పెట్టవలెననే దురుద్దేశ్యముతో కాలయాపన చేయుచున్నందున అతనికి దావా సమన్లు అమలు జరగనందున శ్రీ కోర్టు వారు Substitited Service ద్వారా పేపరు ప్రకటనకు ఆర్డరు వేసి పై ప్రతివాది హాజరు నిమిత్తం **ది.16-11-2023వ సం॥రం తేదీకి వాయిదా వేసినారు. కావున సదరు వాయిదాకు ప్రతివాది స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని ఉదయం గం॥10:00 ని॥లకు శ్రీ పై కోర్టు వారి ఎదుట హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను.** లేని ఎడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

నరసాపురం, 30-10-23.
ఎన్.ఆనంద చక్రవర్తి
అడ్వకేట్, నరసాపురం
సెల్:98491 45267

బహిరంగ ప్రకటన

ఇందుములముగా సమస్త ప్రజానీకానికి తెలియుజేయునది ఏమనగా! నా క్లయింట్ శ్రీ **గుత్తుల సత్యనారాయణ, తండ్రి: కన్నయ్య** గారికి చివటం గ్రామంలో గల డాక్యుమెంట్ నంబర్: **1787/1994 క్రయ దస్తావేజు** ద్వారా పొందువున్నరు. సదరు ఆస్తిని గృహ ఋణము కొరకు వెరిటాస్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ తాడేప్లిగూడెం బ్రాంచ్ నందు ఋణము తీసుకొనుచున్నడు. సదరు ఆస్తికి సంబంధించిన లింక్ డాక్యుమెంట్ **ఒరిజినల్ రిజిస్టర్ దస్తావేజు నెం.1898/1979** ఈ లింక్ ఒరిజినల్ దస్తావేజు జిరాక్స్ కాపీలు తీసుకొనుటకు వెళ్లుచుండగా ఒరిజినల్ లింక్ దస్తావేజు పోయినది. ఎంత కాలం వెతికినా దొరకలేదు. వెరిటాస్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ తాడేప్లిగూడెం బ్రాంచ్ నుండి ఋణము తీసుకుంటున్నారు, ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ పోయినా దృష్ట్యా ప్రత్యనంగా **సేల్ డీడ్ 1898/1979** యొక్క సర్టిఫైడ్ కాఫీ ఋణము మొత్తానికి హామీగా సదరు బ్రాంచ్‌కు అవసరమైన అన్ని డాక్యుమెంట్స్‌తో పాటు డిపాజిట్ చేస్తున్నారు. కావున ప్రజానీకానికి తేలియుజేయునది ఏమనగా, సదరు ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ దొరికిన వారు ఈ దిగువ ఇవ్వబడిన చిరునామాకు లేదా పైన తెలిపిన నా క్లయింట్ చిరునామాకు వాపసు చేయగలరు. కావున ఈ ప్రకటన జారిచేయడమైనది.

K.SRINIVASA RAO
Advocate & Notary, Tadepalligudem
Cell: 99895 24989

పత్రికా ప్రకటన

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఇ.పి.నెం. 79/2022
ఇన్ ఓ.ఎస్.నెం. 42/2017

బిట్వీన్:

కోటబోయిన కాసులు, తండ్రి: అప్పారావు, హిందూ, పురుషుడు, 38 సం॥లు, వ్యాపారం, డో.నెం. 4-35-1, 7వ వార్డు, తాడేపల్లిగూడెం, టి.పి.జి. /పి.జె.సి.జె. **...డి. హెచ్.ఆర్**

మరియు

ఈపి మురలీకృష్ణ, తండ్రి: వెంకటేశ్వరరావు, హిందూ, పురుషుడు, 33 సం॥లు, వ్యాపారం, డో.నెం. 4-12-23, శేషమహాలు థియాటర్ వెనుక, తాడేపల్లిగూడెం, టి.పి.జి. /పి.జె.సి.జె. **...జె.డి.ఆర్**

పై నెంబరు గ్రంధములో డి.హెచ్.ఆర్. గారు శ్రీ కోర్టు వారి ద్వారా మిమ్ములను శ్రీ కోర్టు వారి ఎదుట హాజరు కావాలని పలుమార్లు కోర్టు వారి ద్వారా నోటీసులు పంపినప్పటికీ మీరు కోర్టు నోటీసులు తీసుకొనకుండా ఉద్దేశ్యపూర్వకంగా కాలయాపన చేయుచున్నారనిన్నీ, కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది.14-11-2023వ తేదీ నాటికి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥10:30 ని॥ల లగాయితు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా గాని హాజరు అయ్యి మీయొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను.** లేని ఎడల పై పిటీషను మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

తాడేపల్లిగూడెం, 30-10-23.
జి.వి.ద్వారకానాధ్
డి.హెచ్.ఆర్ తరుపు న్యాయవాది